గ్రూపు-2పరీక్షకు ఉచిత ఫుల్ లెంగ్త్ మాక్ టెస్టులు

ఆసిఫాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మైనార్టీ(ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శిలు) యువతకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారిచే నిర్వహించే గ్రూపు-2 సర్వీసెస్ పరీక్షకు డిసెంబరు2, 3, 9, 10 తేదీల్లో ఉచిత ఫుల్‌లెంగ్త్ మాక్ టెస్టులు నిర్వహిస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి ఆర్ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల29లోగా కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగితావివరాలకు 8500723745 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జోనల్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సిర్పూర్(టి), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సాంఘికసంక్షేమ పాఠశాలకుచెందిన విద్యార్థులు జోనల్‌పోటీల్లో సత్తాచాటారు. ఈనెల11నుంచి 18 వరకు లక్షెట్టిపేటలో జరిగిన ఖోఖో, అథ్లెటిక్స్ జోనల్స్ స్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు నాణ్యతను పరిశీలించిన అధికారులు



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారి

బెజ్జూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల చేపట్టిన రోడ్ల నిర్మాణ నాణ్యతను గురువారం హైదరాబాద్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ రాములు పరిశీ లించారు. మండలంలోని బెజ్జూరు-ఎల్కపల్లి, కుంటల మానేపల్లి- హేటిగూడ, డబ్బాగూడ- ఆర్‌ఆర్పీ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డును పరిశీలించి నమునాలను సేకరించారు. సేకరించిన నమునాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయనవెంట ఏఈ బద్రొద్దీన్ ఉన్నారు.

నెట్‌బాల్ జిల్లా, జోనల్‌స్థాయి క్రీడాకారుల ఎంపిక



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఆదర్శపాఠశాలలో గురువారం ఎస్‌జీఎఫ్‌అండర్-17 బాలబాలికల నెట్‌బాల్ పోటీలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలెవల్‌తోపాటు జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపికపోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 200మంది విద్యార్థులు పాల్గొనగా ఉమ్మడి జిల్లానుంచి బాలురు 12మంది, బాలికలు 12మందిని ఎంపిక చేశామన్నారు. వీరుఈనెల23న నిర్వహించే రాష్ట్రస్థాయిపోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లాసెక్రెటరీ వెంకటేశం, గిరిజనస్పోర్ట్‌ఆఫీసర్ మీనారెడ్డి, ప్రిన్సిపాల్ మహేశ్వర్, పీడీలు, పీఈటీలు హరికృష్ణ, ఏడుకొండలు, స్వరూప, శ్రీవాణి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి

ఆసిఫాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి నికేతన్ ఎంపికయ్యాడు. ఈనెల 25న మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనున్నట్లు కరస్పాండెంట్ రాజేశ్వర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెక్చరర్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల సిబ్బంది అభినందించారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు సన్మానం



ఛైర్మన్‌ను సన్మానిస్తున్న ఆదివాసులు

జైనూర్, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి): మండల మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం మార్కెట్‌కమిటీ ఛైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌ను, డైరెక్టర్ పంద్ర షేకును ఆదివాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా పత్తి, సోయా వంటి పంట ధాన్యాలు దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు కుంర శాంరావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెందుర్ ప్రకాష్, ఆదివాసులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గం

పెంచికలపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గంను గురువారం జిల్లాఅధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంతోష్, ప్రధానకార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా భాస్కర్‌తోపాటు పలువురుసభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రాజన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.



వరదలతో నష్టపోయిన పత్తి పంట (ఫైల్)

అందని పూర్తి పంట నష్టపరిహారం

- ఇప్పటికే పలు మండలాల్లో రైతుల ఆందోళన
- జిల్లాలో సుమారు మూడువేల ఎకరాల్లో పైగా నష్టం
- పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని రైతుల వేడుకోలు

చింతలమానేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గడిచిన మూడేళ్లుగా జిల్లా రైతులను వరదలు వెంటాడుతున్నాయి. నది పరివాహక ప్రాంతాల్లోని పంటలకు తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లుతోంది. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరులో భారీవర్షాలతో పెద్దవాగు, ప్రాణహిత, పెన్‌గంగా, వార్ధా నదులు ఉప్పొంగి పంటలు నీటమునిగాయి. అయిదురోజుల పాటు పంటలు వరదనీటిలోనే ఉండడంతో తీవ్రనష్టం వాటిల్లింది. వరదలతో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం మంజూరు చేసింది. దీనికి 33శాతానికి పైగా దెబ్బతిన్న పంటలను మాత్రమే పరిగణలోకి తీసుకున్నారు. ఫలితంగా చాలామంది రైతులకు పరిహారం అందలేదు. నెలరోజులుగా వివిధ మండలాల్లోని బాధిత రైతులు ఆందోళనలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు.

రూ.2.69కోట్లు విడుదల..

జిల్లా వ్యాప్తంగా 4.23లక్షల ఎకరాల్లో పత్తి, వరి, కంది, మిరప తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా పత్తి 3.29లక్షల ఎకరాలు ఉండగా, వరి సుమారు 55వేల ఎకరాల్లో ఉంది. ఆగస్టు చివరివారం, సెప్టెంబరు మొదటివారంలో కురిసిన భారీవర్షాలకు నదిపరివాహక ప్రాంతాలతో పాటు చెరువులు, వాగుల సమీపంలోని పంటలు బ్యాక్‌వాటర్‌తో రోజుల తరబడి నీటిలో మునిగి పోయాయి. జిల్లాలో సుమారు మూడువేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధి కారులు అంచనా వేశారు. ప్రభుత్వం 2,692.11ఎకరాలకు 1374మంది రైతులకు మాత్రమే రూ.22,69,22,750 పరిహారం మంజూరు చేసింది. పంటలు నష్టపోయిన వారి వివరాలను వ్యవసాయ శాఖ సర్వేచేసి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించింది. ప్రభుత్వం గత నెలలో నిధులు విడుదల చేయగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. అయితే క్షేత్రస్థాయిలో నష్టం ఇంకా ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

అన్నదాతల ఆందోళనలు..

ప్రాణహిత, పెద్దవాగు ఉప్పొంగడంతో సిర్పూర్ నియోజకవర్గంలో సిర్పూర్(టి), కౌటాల, చింతలమా నేపల్లి, దహెగాం, పెంచికలపేట, బెజ్జూరు మండలాల్లో అత్యధింగా పంటలు దెబ్బతిన్నాయి. ప్రాణహిత వరద తగ్గకపోవడంతో అయిదు రోజులపాటు పంటలు నీటమునిగి ఉన్నాయి. పత్తినీట మునగగా మరోసారి ప్రత్యామ్నాయ పంటలు సాగుచేశారు. చేలలో నిలువచేసిన ఎరువుల బస్తాలు సైతం వరదకు కొట్టుకు పోయాయి. బెజ్జూరు మండలంలో చాలామందికి పరిహారం రాలేదని గతనెలలో రైతులు మండలకేంద్రంలో ఆందోళన చేపట్టారు. దహెగాం మండలం మొట్లగూడ, రావులపల్లి, రాంపూర్ గ్రామాల్లో ప్రాణహితనది వరదలో నష్టపోయిన రైతులు కూడా కాగజ్‌నగర్ ఏడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రైతులు ఆందోళనలు చేసిన సమయంలో ప్రభుత్వానికి నివేదికలు పంపించామని చెబుతూ వ్యవసాయాధికారులు చేతులు దులుపుకొన్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టకపోవడంతో పూర్తిస్థాయిలో పరిహారం మంజూరుకాలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని వేడుకుంటున్నారు.

అయిదు ఎకరాల్లో పంట నష్టం జరిగింది..

- మారేష్, రైతు, కేతిని



వర్షాకాలంలో కురిసిన వర్షాలకు అయిదు ఎకరాల్లో సాగుచేసిన పంట పూర్తిగా మునిగిపోయింది. దీంతో తీవ్రంగా నష్టపోయాను. ప్రభుత్వం అందజేసిన నష్టపరిహారం నాకు అందలేదు. అధికారులు స్పందించి నష్టపోయిన నాకు పరిహారం అందించాలి. నష్టపోయిన మిగితా రైతాంగాన్ని కూడా ఆదుకోవాలి.

జాతీయ సాధన సర్వేలో జిల్లాను అగ్రభాగాన నిలపాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ సాధనసర్వేలో జిల్లాను అగ్రభాగాన నిలపాలని జిల్లా అకడమిక్‌మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం గుండి జిల్లాపరిషత్ సెకండరీపాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు 4న జాతీయసాధన సర్వే3,6,9వ తరగతులకు ఉంటుందన్నారు.

దానిలో భాగంగా విద్యార్థు లకు ప్రత్యేకతరగతులు నిర్వహిస్తూ కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. అభ్యసన ప్రదీపికలను సమర్థవంతంగా వినియోగించుకొని అన్ని అభ్యసన సామర్థ్యాలు, ఓఎంఆర్ పత్రాలమీద విద్యార్థులకు పూర్తిఅవగాహనను పెంపొందించాలన్నారు. అలాగే పదవతరగతి ఇద్యార్థులకు సెలబస్ సకాలంలో పూర్తిచేయాలని, మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు. ఆయనవెంట ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యా యులు ఉన్నారు.



ఆసిఫాబాద్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానిటరింగ్ అధికారి శ్రీనివాస్



కౌటాల: మొగడ్‌దగడ్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో హనుమంతు

పాఠశాలను సందర్శించిన ఎంఈవో..

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో హనుమంతు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 91మంది విద్యార్థులకు 88మంది విద్యార్థులు హాజరుకావడంతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను అభినందించారు. మెనూప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం ఆశ్రమఉన్నత పాఠశాలలో 9వతరగతి విద్యార్థుల ఎన్‌ఏఎస్ (జాతీయ సాధన సర్వే) సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే నజరత్ మిషన్, భారతి విద్యామందిర్ పాఠశాలలను సందర్శించారు. ఎన్‌ఏఎస్‌పై విద్యార్థులను సన్నద్ధం చేయాలని అన్నారు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఏసీఎంవో ఉద్దవ్ అన్నారు. గురువారం పీఎంఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు ఖచ్చితంగా ప్రతిరోజు మూడు పూటలు ఫొటోలు పంపాలని, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పర్యవేక్షణ బాధ్యతకూడా ఉపాధ్యాయులదేనని అన్నారు. ఖచ్చితంగా రిజిస్టర్‌లను సక్రమంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ఉపాధ్యాయులు డైరీ ఉపయోగించి, స్కూల్‌గ్రాంట్ విషయంలో పాఠశాలకు వచ్చిన నిధులను పాఠశాలకు ఖర్చు చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్కూల్ యూనిఫాం తొందరగా విద్యార్థులకు అందించాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని, పాఠశాల ఆవరణ ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు రవీందర్ రాథోడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వచ్చేనెల 18న డైట్ పరీక్షలు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్‌లో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు డిసెంబరు 18నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 18వతేదీ నుంచి 24వరకు పరీక్షలు కొనసాగు తాయని విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ముదిరాజుల హక్కుల కోసం పోరాడుదాం



జిల్లా కేంద్రంలో జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు మురళీ

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ముదిరాజుల హక్కుల కోసం పోరాడుదామని తెలంగాణ ముదిరాజ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు సేర్ల మురళీ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు పెద్దమ్మ తల్లికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపాలని పేర్కొన్నారు. బీసీ-డీలో ఉన్న తమను బీసీ-ఏలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సతీష్, రవి, రాజేష్, నరేష్, బాలేష్, సాయిరాం, శంకర్, రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బోదంపల్లిలో ముదిరాజ్ దశాబ్ది ఉత్సవాలు

కౌటాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోదంపల్లిగ్రామంలో గురువారం ముదిరాజ్ దశాబ్దిఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ముదిరాజుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపాలని పేర్కొన్నారు. బీసీ-డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజులు అన్నివిధాల వెనకబడి ఉన్నారని వారి సంక్షేమం, అభివృద్ధికోసం ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండలాధ్యక్షుడు కమలాకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



కౌటాలలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ముదిరాజ్‌లు

ఘనంగా మత్స్యకార దినోత్సవం

బెజ్జూరు: మండలంలోని హేటిగూడగ్రామంలో గురువారం ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ముదిరాజ్ మండలాధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అంశానికి చర్యలు చేపట్టి కులగణన సంపూర్ణంగా పూర్తిచేసి బీసీలకు రిజర్వేషన్లు జనాభా ప్రాతిపాదికన పెంచాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లలో ముదిరాజ్‌లకు జనాభాకు తగ్గట్టు వాటా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మహేష్, సన్యాసి, మహేష్, అశోక్, లింగయ్య, అంజయ్య, శ్రీశైలం, శ్రీనివాస్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

రెబ్బెన, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల విద్యావనరుల కేంద్రంలో పనిచేస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు ఎంఈవో వెంకటేశ్వర్‌కు గురువారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వేముల సత్యనారాయణ, సీఆర్పీ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ తమను రెగ్యులర్ చేయాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు, నాయకులకు వినతి పత్రాలు సమర్పించామన్నారు. అయినప్పటికీ ఇంతవరకు సమస్యలు పరిష్కరించలేదన్నారు. త్వరలోనే సమ్మె చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు దేవేందర్, ఆర్‌మహేశ్వర్, భాగ్యలక్ష్మి, స్వప్న, పుష్పలత, తిరుపతి, శంకర్, రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్స్ అందజేత



కాగజ్‌నగర్‌లో సెల్‌ఫోన్ అందజేస్తున్న సీఐ

కాగజ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సదాశివ్ తన సెల్ ఫోన్‌ను పోగొట్టు కోగా గురువారం పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను ఆధునిక సాంకేతికను వినియోగించి రికవరీ చేస్తున్నట్లు తెలిపారు.

సిర్పూర్(టి): మండల కేంద్రానికి చెందిన ఆడె విశ్వనాథ్ వారం రోజుల క్రితం ఫోన్ పోగొట్టుకోగా గురువారం యువకుడికి ఎస్సై కమలాకర్ అందజేశారు. వారంరోజుల క్రితం ఫోన్ పోవడంతో విశ్వనాథ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేయగా సాంకేతికపరిజ్ఞానంతో ఫోన్‌ను కనుగొని బాధితుడికి అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను గురువారం ఎమ్మెల్యే కోవలక్ష్మి పంపిణీచేశారు. మండలంలోని పదిమందిలబ్ధిదారులకు చెక్కులు మంజూరుకాగా వాటిని బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ఛైర్మన్ అలీబీన్‌అహ్మద్, రవీందర్, సందీప్, మురళీ పాల్గొన్నారు.

గ్రామాల్లో పెద్దపులి సంచారం?

- భయాందోళనలో గిరిజన గ్రామాలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

జైనూర్/సిర్పూర్(యు) నవంబరు21, (ఆంధ్రజ్యోతి): జైనూర్, సిర్పూర్(యు) మండలాల్లో గురువారం పెద్దపులి కనిపించిందని రైతులు చేనులోనుంచి ఇంటికి పరుగులు తీశారు. సిర్పూర్(యు) మండలంలోని పంగిడి,జైనూరు మండలంలోని లేండిజాల, పానాపటార్ ప్రాంతాల్లో పులితారసపడిందని ఆయా గ్రామాల రైతులు భయాందోళనకు గురయ్యారు. పులి ప్రస్తుతం జైనూరు మండలంలోని సుంగాపూర్‌లొద్దిలో ఉందని ఎఫ్‌ఆర్వో జ్ఞానేశ్వర్ తెలిపారు. లేండిజాల, పంగిడి ఏరియాలో పులి వచ్చిందని వస్తున్న పుకార్లను ఆయన కొట్టిపారేశారు. అదేవిధంగా సుంగాపూర్ లొద్దిలో ఉన్న పులిఎప్పుడైన బయట రావచ్చని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఈసందర్భంగా ఉదయం 10 గంటల తర్వాతే చేను, ఇతరత్ర పనులకు వెళ్లాలని, సాయంత్రం 4గంటలలోపు తిరిగి తమ తమ ఇళ్లకు చేరుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా మని ఎఫ్‌ఆర్వో జ్ఞానేశ్వర్ కోరారు.

కౌలు రైతులను గుర్తించి రైతుభరోసా కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న స్వరాజ్యం వేదిక సభ్యులు

ఆసిఫాబాద్, నవంబరు 21: కౌలురైతులను గుర్తించి వారికి రైతు భరోసా నిధులు వచ్చే విధంగా అసెంబ్లీలో ప్రస్తావించాలని రైతుస్వరాజ్యం వేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిప్రతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్రన్న మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లాలో 1.17లక్షల మంది కౌలురైతులు ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కౌలురైతులకు రైతుభరోసా ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. దీంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కౌలు రైతుల సమస్యలను శీతాకాలఅసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మాణిక్‌రావు, దుందెరావు, యశ్వంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కెరమెరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామస్థాయినుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండలసర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారెంటీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు.

కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, వెంకట్‌నాయక్, రాజు నాయక్, శ్రీకాంత్, తుకారాం, ఉత్తంనాయక్, నవీన్‌కుమార్, వినోద్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రెబ్బెన, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖైరిగాం గ్రామానికి చెందిన ఎర్ర లచ్చయ్య(65) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. లచ్చయ్య ఈనెల 20న రోడ్డు దాటుతుండగా ఆసిఫాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లతున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో లచ్చయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన లచ్చయ్యను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-363పై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. గోదావరిఖనికి చెందిన నలుగురు కారులో కన్నెపల్లి మండలంలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి దర్శనం నిమిత్తం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శ్రీరాంపూర్ వద్దకు రాగానే జాతీయ రహదారిపై ముందు ప్రయాణిస్తున్న ఎక్స్‌కావేటర్(జేసీబీ)ను ఢీకొట్టారు. దీంతో కారు హైవే దిగి కింద ఉన్న సర్వీస్ రోడ్డుపైకి వెళ్లింది. కారు బెలూన్లు తెరచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. నలుగురికి గాయాలు కావడంతో క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన కారు రోడ్డు మధ్యలో ఉండడంతో ఢీకొన్న ఎక్స్‌కావేటర్‌తోనే పక్కకు తొలగించారు. ప్రమాదంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ సంతోష్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి గాయాలు

భీమారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆరేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో గోదావరిఖనికి చెందిన జక్కుల ఐలయ్య, గాదె పోశంలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖనికి చెందిన ఐలయ్య, పోశంలు చెన్నూరుకు వెళ్తుండగా ఆరేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో పోశంకు తీవ్ర గాయాలు కాగా ఐలయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేటగాళ్ల అరెస్టు

మందమర్రిరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సారంగపల్లి పంచాయతీ దుబ్బపల్లిలో ఇటీవల వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలు అమర్చగా వాటికి తగిలి రెండు బర్రెలు మృతిచెందాయి. విద్యుత్ తీగలు అమర్చిన ముగ్గురు నిందితులను అటవీ శాఖ అధికారులు గురువారం అరెస్టు చేశారు. డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం సండ్రోన్‌పల్లికి చెందిన గోస్కుల సతీష్, గోస్కుల రాజు, దైనేని లచ్చులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించామన్నారు. అటవీ బీట్ ఆఫీసర్లు రాజేశ్వరి, సతీష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కాదు... హత్య

కేసు వివరాలు వెల్లడించిన ఏసీపీ



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

భీమారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కారుతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి హత్య చేసిన సంఘటన వివరాలను గురువారం ఏసీపీ వెంకటేశ్వర్ వెల్లడించారు. రసూల్‌పల్లి గ్రామానికి చెందిన ఆకుదారి మల్లేష్ ప్రైవేట్ పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన తోట సాయికిరణ్ భార్యతో మల్లేష్ వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే అనుమానంతో మల్లేష్‌పై పగ పెంచుకున్నాడు. సాయికిరణ్, బంధువు గట్టు సదయ్యలు బుధవారం ఉదయం మండల కేంద్రానికి కారు (ఏపీ28ఈ8595)తో చేరుకున్నారు. మల్లేష్ బైక్‌పై పాఠశాలకు వెళ్తుండగా వెనక నుంచి ఢీకొట్టి ఇద్దరు పరారయ్యారు. మల్లేష్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి ఆకుదారి రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టి కారును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. గురువారం రసూల్‌పల్లి ఎక్స్ రోడ్డు వద్ద నిందితులు ఉన్నారనే సమాచారం మేరకు అరెస్టు చేశామన్నారు. నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ , సిబ్బంది పాల్గొన్నారు.

అధునాతన టెక్నాలజీతో జైళ్ల నిర్మాణం

-జైళ్లశాఖ వరంగల్ రేంజ్ డిప్యూటీ జనరల్ ఎం సంపత్



మాట్లాడుతున్న జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్

కరీంనగర్ క్రైం, నవంబరు 21: జిల్లాల్లో అధునాతన టెక్నాలజీతో జైళ్లను నిర్మిస్తున్నామని జైళ్లశాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్ అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని జైలు అధికారులు, సిబ్బందికి రెండు రోజుల పునశ్చరణ తరగతులు గురువారం కరీంనగర్ జైలులో ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డిప్యూటీ జనరల్ ఎం.సంపత్ హాజరై మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో అధునాతన టెక్నా లజీతో జిల్లా జైలును నిర్మిస్తున్నామన్నారు. ఇతర జిల్లాల్లో కూడా అధు నాతన టెక్నాలజీతో జైళ్లను నిర్మించి, ఖైదీల రద్దీని తగ్గిస్తామని తెలి పారు. మరో అతిథి శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ జైళ్ల శాఖ తీసుకుంటున్న వివిధ సంక్షేమ కార్య క్రమాలు, సంస్కరణలు గురించి కొనియాడారు. కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రీజినల్ లెవల్ రిట్రీట్‌లో భాగంగా ఖైదీల, సిబ్బంది సంక్షేమం, క్రమశిక్షణ, ఆరోగ్యం, సెక్యూరిటీ గురించి చర్చించి భవిష్యత్తులో జైళ్ల శాఖ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జైలు వైద్య అధికారి డాక్టర్ కె వేణుగోపాల్, సైకియాట్రిస్ట్ ఎల్ వర్షి, అప్పన్న గారి వెంక ట్రావు, జైలర్స్ పి శ్రీనివాస్, రమేష్, పర్శురామ్, డిప్యూటీ జైలర్స్ శ్రీని వాస్‌రెడ్డి, ఎస్.సుధాకర్‌రెడ్డి, రమేష్, సంగీత, మినిస్టీరియల్, మెడికల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

వరిలో నాణ్యతా ప్రమాణాలపై అవగాహన

చెన్నూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అస్నాద గ్రామంలో వ్యవసాయ శాఖ ఏవో యామిని వరిలో నాణ్యత ప్రమాణాలపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. హార్వెస్టర్ వరి కోత కోసే సమయంలో ఆర్పీఎం 18గా ఉండాలని తెలిపారు. పత్తిలో నాణ్యత ప్రమాణాల గురించి వివరించారు. సేంద్రియ వ్యవసాయ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఏఈవోలు సాగర్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి నాగరాజు

- కళాకారుడు, రచయిత, దర్శకుడు, నటుడిగా రాణింపు
- సినిమా రంగంలో తనదైన ముద్ర
- వేలాది ప్రదర్శనలు..




షూటింగ్‌లో నాగరాజు

మందమర్రి టౌన్, నవంబరు 21 : ప్రజా చైతన్యమే లక్ష్యంగా కళలతో ప్రజలను, సమాజాన్ని మేల్కొల్పుతున్నాడు అంతడుపుల నాగరాజు. మూడున్నర దశాబ్దాలుగా కవిగా, కళాకారుడిగా, రచయితగా, దర్శకుడిగా, నటుడిగా రాణిస్తున్నాడు మందమర్రి పట్టణంలోని 1వ జోన్‌కు చెందిన ధూంధాం జాతీయ కళాకారుడు నాగరాజు. కళలపై మక్కువ పెంచుకున్న నాగరాజు విద్యార్థి దశ నుంచే పాఠశాలల్లో నృత్య ప్రదర్శనలు చేయడంతో పాటు కాలనీల్లో వినాయక చవితి, ఇతర కార్యక్రమాలు ప్రదర్శనలు ఇచ్చేవాడు. పాటలకు అనుగుణంగా నృత్యాన్ని ప్రదర్శించడం అలవాటు చేసుకున్నాడు. పదో తరగతి అనంతరం నటరాజ కళా నిలయంలో చేరి డ్యాన్స్ మాస్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆయా పోటీల్లో పాల్గొని అవార్డులు అందుకున్నారు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో

స్వరాష్ట్ర ఉద్యమాన్ని తారా స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. తెలంగాణ ధూంధాంను రూపకల్పన చేసి హైదరాబాద్‌లో కళాకారులు, రచయితలతో ఆవిష్కరింపజేసి గుర్తింపు పొందాడు. ధూంధాం వ్యవస్థాపకుడిగా పేరును సాధించాడు. 1998 నుంచి గద్దర్‌తో పరిచయం పెంచుకుని ఆయనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆటాపాటలతో తెలంగాణ ప్రజలను చైతన్యపరుస్తూ ఉద్యమాన్ని ఉధృతం లూగించారన్నారు. అంతే కాకుండా వివిధ దేశాల్లో ప్రదర్శనలు నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. గద్దర్ పరిచయంతో ఆయనతో పాటు అనేక కళా ప్రదర్శనలు చేశారు. జై బోలో తెలంగాణ సినిమాకు నృత్య దర్శకత్వంతోపాటు నటుడిగా కూడా చేశారు. ప్రజా సామాజిక చైతన్యానికి సంబంధించి ఆల్బమ్స్ రూపొందించి విడుదల చేశారు. జానపదానికి పెట్టింది పేరుగా అంతడుపుల నాగరాజుకు గుర్తింపు వచ్చింది. సీడీల రూపంలో ఆటా పాటలను విడుదల చేశారు. ఈ ప్రాంతంలో ఎంతో మంది కళాకారులను నాగరాజు తీర్చిదిద్దారు.



గద్దర్‌తో పుస్తకం ఆవిష్కరిస్తున్న జాతీయ కళాకారుడు అంతడుపుల నాగరాజు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో

నమ్ముకున్న కళతోనే నా ప్రయాణం..



స్వరాష్ట్ర సాధన కోసం కళాకారులు తమ ఆటాపాటలతో ఉద్యమాన్ని తారా స్థాయికి తీసుకెళ్లారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత చాలా మంది కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించారు. కాని నన్ను విస్మరించారు. నమ్ముకున్న కళతోనే నా ప్రయాణం. ప్రాణం ఉన్నంత వరకు కళలు, కళాకారుల కోసం పని చేస్తుంటాను. కళలతోనే ప్రజా చైతన్యం సాధ్యం.

- అంతడుపుల నాగరాజు, జాతీయ ధూంధాం వ్యవస్థాపకులు

23, 24 తేదీల్లో ప్రత్యేక ప్రచారదినాలు: డీఆర్వో

ఆసిఫాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికలసంఘం, జిల్లాఎన్నికల అధికారి ఆదేశాలమేరకు ఓటరుజాబితా సవరణ కార్యక్రమం-2025లో భాగంగా ఈ నెల 23, 24తేదీల్లో ప్రచార దినాలు నిర్వహిస్తామని ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు తెలిపారు. ప్రతిపోలింగ్ కేంద్రంలో ఓటరు సౌకర్య కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. అన్ని బూత్‌స్థాయి అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటలవరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. జనవరి1, 2025నాటికి 18సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 28వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

తుడుందెబ్బ జిల్లా కమిటీలో ఇద్దరు మండలవాసులు

జైనూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ నియామకంలో భాగంగా జిల్లా తుడుందెబ్బ అధ్యక్షుడిగా కోవ విజయ్, జిల్లాప్రధాన కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఉయిక చందన్‌షావ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర తుడుందెబ్బ కమిటీ నాయకులు తమకు జిల్లాకమిటీలో చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్కాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో గురువారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఉదయ్‌బాబు మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జనవిజ్ఞానవేదిక బాధ్యులను అభినందించారు. ఈనెల28న నిర్వహించే జిల్లా స్థాయి చెకు ముకి పోటీలకు విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక జిల్లాప్రధానకార్యదర్శి రాజేష్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో 9.9డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత



లింగాపూర్‌లో చలికి నెగళ్లు కాగుతున్న ప్రజలు

ఆసిఫాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీలో చలితీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. సిర్పూర్ (యు) మండలంలో గురువారం రాష్ట్రంలోనే కనిష్టంగా 9.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. తిర్యాణి మండలంలో 11.2డిగ్రీలు, వాంకిడిలో 12.2డిగ్రీలు, కెరమెరిలో 12.4 డిగ్రీల అత్యల్పఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఏజెన్సీ మండలాలు చలికి వణికిపోతుండడంతో ఉదయం సాయంత్రం వేళల్లో ఆయాగ్రామాల్లో నెగళ్లు ఏర్పాటు చేసుకని చలిమంటలు కాగుతూ ప్రజలుచలినుంచి ఉపశమనం పొందుతున్నారు.

మంచిర్యాలజిల్లాలో 12.7డిగ్రీల ఉష్ణోగ్రత..

మంచిర్యాల: మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా చలి క్రమేపీ పెరుగుతోంది. గురువారం కనిష్ట ఉష్ణోగ్రతలు 12.7డిగ్రీలు నమోదయ్యాయి. జన్నారం మండలం తపాల్‌పూర్‌లో 12.7డిగ్రీలు నమోదుకాగా, జన్నారం మండల కేంద్రంలో 13.4డిగ్రీలు, జైపూర్ మండలంలో 13.7డిగ్రీలు, భీమారం మండలకేంద్రంలో, నెన్నెల మండలంలో 13.9డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో చలి తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నిరుపయోగంగా యోగా కేంద్రం



నిరుపయోగంగా ఉన్న యోగా కేంద్రం

వాంకిడి, నవంబరు 21: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలోని యోగా కేంద్రం నిరుపయోగంగా మారింది. మారుతున్న జీవనశైలి, వ్యాధుల నేపథ్యంలో సంప్రదాయ వైద్యంపై ఆదరణ పెంచడానికి ఆయుష్ ఆధ్వర్యంలో ఆరోగ్య స్వస్థత కేంద్ర పేరుతో దీనిని నిర్మించారు. ఇందుకు రూ.4.5 లక్షలు ఖర్చుచేశారు. ఉదయం పురుషులతో నెలకు 28రోజులు సాయంత్రం మహిళతో నెలలో 22తరగతులు యోగాసాధన చేయించాలి. పురుష శిక్షకులకు నెలకు రూ.8వేలు, మహిళా శిక్షకులకు రూ.5వేలని అధికారులు నిర్ణయించారు. కానీ శిక్షకుల నియామకప్రక్రియలో జాప్యంతో ఈకేంద్రం నిరుపయోగంగా మారింది. చలికాలం మొద లైన నేపథ్యంలో యోగా సాధనకు అనువైన సమయము. యోగా కేంద్ర నిర్మించి నెలలు గడుస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం యోగాకేంద్రం నిరుపయోగంగా ఉండడంతో సమీపంలో ఆస్పత్రి భవన నిర్మాణాలు చేపడుతున్న సదరు కాంట్రాక్టర్ అందులో పని చేస్తున్న కార్మికులు ఉండడానికి ఉపయోగిస్తున్నాడు. సంబంధిత అధికారులు యోగా కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకువచ్చి యోగా తరగతులు నిర్వహించాలని యువకులు కోరుతున్నారు.



శ్రీరాంపూర్ ఓసీపీ బీసీ కమిటీ నియామకం

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం శ్రీరాంపూర్ ఓసీపీకమిటీని గురువారం నియమించారు. కన్వీనర్‌గా గండి సతీష్, కో-కన్వీనర్‌గా వీర్లమదన్ ఎన్నికయ్యారు. ఈకమిటీ బీసీసంఘాన్ని మరింత బలపరుస్తూ ఉద్యోగుల హక్కులకోసం పనిచేస్తుందని నాయకులు అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాజీసైదా, మోత్కూరి కొమురయ్య, మారుతి, బద్రి బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ జీఎంగా చంద లక్ష్మినారాయణ

రెబ్బెన, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాకు నూతన సెక్యూరిటీ జనరల్‌మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన చంద లక్ష్మినారాయణ గురువారం కార్మికులు, నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్యమొగిలి, పిట్‌కార్యదర్శి కందుల మల్లేష్ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో గోలేటిబ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

ఏరియాలో పర్యటించిన సెక్యూరిటీ జీఎం..

బెల్లంపల్లి ఏరియాలో గురువారం జీఎం సెక్యూరిటీ అధికారి చందా లక్ష్మినారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా డోర్లి-1, డోర్లి-2, ఏరియా స్టోర్, ఖైరిగూడ ఓసీ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం పలు సమస్యలపై అడిగి సిబ్బందిని తెలుసుకున్నారు. ఆయనవెంట జీఎం ఎం శ్రీనివాస్, ఏరియాసెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, శ్రీనివాస్ రావు, కృష్ణమూర్తి, మదీనా భాషా, రవికుమార్, శ్రీనివాస్, రాజమౌళి, చంద్రయ్య తదితరులున్నారు.

లక్ష క్యూబిక్ మీటర్ల ఓబీని వెలికితీయాలి



శ్రీరాంపూర్ ఓసీపీని తనిఖీ చేస్తున్న డైరెక్టర్

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలో రోజువారీగా లక్ష క్యూబిక్ మీటర్ల ఓబీని వెలికితీయాలని, 12వేల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని డైరెక్టర్(ప్రాజెక్ట్స్‌అండ్‌ప్లానింగ్) జి వెంకటే శ్వర్ రెడ్డి అన్నారు. ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్‌తో కలిసి గనిలోని పని స్థలాలను పరిశీలించారు. ఉపరితలగని ప్లాన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. క్వారీలోని కోల్‌బెంచ్‌లను, ఆఫ్‌లోడింగ్ ప్రదేశాలను తనిఖీ చేశారు. ఉత్పత్తి పెంపుదలకు తగిన సూచనలు ఇచ్చారు. రక్షణతోకూడిన ఉత్పత్తి సాధించాలని, దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఇందారం ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, క్వాలిటీమేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జి మేనేజర్ సంపత్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సర్వే అధికారి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

నియామకాలను నిలిపివేసిన యాజమాన్యం

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు తలొగ్గి యాజమాన్యం కార్మికుల పిల్లలకు ఇచ్చిన కారుణ్య నియామకాలను నిలిపివేసిందని ఏఐటీయూసీ ఉపప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కెసమ్మయ్య ఆరోపించారు. యూనియన్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. గతనెల 27న జీఎం కార్యాలయంలో కారుణ్య నియామకపత్రాలను అందించారన్నారు. ఒక్క రోజు వీటీసీ చేసిన తరువాత వారికి ఇచ్చిన నియామక పత్రాలను నిలిపివేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుతంత్రంతో తామే ఆ ఉద్యోగాలు ఇచ్చినట్లు ప్రచారం చేసుకోవడానికే ఈ ఎత్తు వేసిందన్నారు. వెంటనే వీటీసీ పూర్తిచేయించి, విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల సాధనకు పోరాటాలు

- ఇన్‌కమ్ టాక్స్‌తో కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు

మందమర్రిటౌన్, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల సాధనపోరాట కార్యక్రమాలు చేపడుతున్నామని హెచ్‌ఎంఎస్ నాయకులు జె శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మందమర్రిలోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు ప్రతీనెల ఇన్‌కమ్‌టాక్స్ పేరిట కోత విధిస్తున్నారని, టాక్స్ రద్దుకు సంబంధించి ప్రజాప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేయాలని కోరారు. ఈసారి జరిగే శీతాకాల సమావేశాల్లో పెద్దపల్లి ఎంపీ వంశీవివేక్ కూడా ఈవిషయంపై ప్రస్తావించాలని పేర్కొన్నారు. మరో రెండు మూడురోజుల్లో యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పిలుపు మేరకు మందమర్రి ఏరియాలో అన్ని గనులు, డిపార్టుమెంట్లలో పోరాటకార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో వెల్ది సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టేట్స్ జనరల్ మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టి శ్రీరాంపూర్ ఏరియాకువచ్చిన ఎస్టేట్స్ జీఎం రాధాకృష్ణను ఏరియాఇన్‌చార్జి జీఎం టిశ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్ర మంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఇందారం ఓసీపీ పీవో ఏవీరెడ్డి, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత ఉద్యోగులకు పరీక్షలు

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని అంతర్గతఉద్యోగులకు టెండాల్, టెండాల్ సూపర్‌వైజర్, రోప్‌సైనర్, ఆఫీస్ అటెండెంట్ ఖాళీల భర్తీకి గురువారం పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 11మంది ఉద్యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఎస్ఈ రామిరెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

క్రీడా మైదానంలో వాటర్ ట్యాంకు నిర్మించవద్దు

చెన్నూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్మించ తలపెట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణాన్ని విరమించుకోవాలని కౌన్సిలర్ జాడి సురేఖ తెలిపారు. గురువారం మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణకు వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ ఎంతోమంది క్రీడాకారులు, విద్యార్థుల మానసిక వికాసానికి తోడ్పడేందుకు ఉపయోగపడే క్రీడా మైదానంలో వాటర్ ట్యాంకు నిర్మించడం వల్ల ఇబ్బందులు ఏర్పడతాయని ఆమె పేర్కొన్నారు.

పాఠశాల ఆవరణలో నిర్మించే వాటర్ ట్యాంకు నిర్మాణాన్ని మరోచోట చేపట్టాలని గురుకృప స్పోర్ట్స్ క్లబ్‌సభ్యులు ఎమ్మెల్యే వివేక్‌ను కోరారు. గురువారం ఉదయం పట్టణంలో మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యేకు వాటర్ ట్యాంకు నిర్మాణం వల్ల కలిగే నష్టంపై వివరించారు. అధ్యక్షుడు రామయ్య, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

గర్మిళ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టుల్లోకి తీసుకోవాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ చేయాలని 2016లో ఉద్యమం చేయగా అప్పటి సీఎం కేసీఆర్ పర్మినెంటు చేస్తామని చెప్పి 2017లో మమ్మల్ని విలీనం చేస్తూ మాకు ఆర్డర్లు ఇచ్చారని తెలిపారు. అనంతరం కొందరు నిరుద్యోగులు కోర్టులో కేసు వేయగా పర్మినెంటు చేసుకునే వెసలుబాటును రాష్ట్ర ప్రభుత్వానికి కల్పిస్తూ తీర్పు వచ్చిందన్నారు. ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయాలని కోరారు.

నేటి నుంచి ఉచిత యోగా తరగతులు

నెన్నెల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆయుష్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నుంచి ఉచిత యోగా తరగతులు నిర్వహించనున్నట్లు యోగా గురువు కాసం ప్రదీప్‌కుమార్ తెలిపారు. రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తిగల వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఇంటి వద్దకే కార్గో సేవలు

- వస్తువులు త్వరగా చేరవేత
- ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు
- ఆర్టీసీ సేవలను ఉపయోగించుకుంటున్న ప్రజలు, వ్యాపారులు



బస్సులో నుంచి దించుతున్న కార్గో ద్వారా బుక్ చేసుకున్న వస్తువులు

బెల్లంపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు ఆదాయం పెంపుపై దృష్టి సారించింది. వివిధ వస్తువులు రవాణా చేస్తుండడంతో వ్యాపారులు, ప్రజలు కార్గో సేవలను పెద్దఎత్తున వినియోగించుకుంటున్నారు. ప్రైవేటు రంగంలోని పార్శిల్ సర్వీసులతో పోలిస్తే కార్గో సేవలు వేగంగా చేరడంతో ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం పెరుగుతోంది.

ఇంటికే డెలివరీ

ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభమైనప్పటి నుంచి బస్టాండ్‌లో మాత్రమే వస్తువులను తీసుకునే అవకాశం ఉండేది. చాలా మంది కస్టమర్లు ఇబ్బందులు పడ్డారు. దీనిపై దృష్టి సారించిన ఆర్టీసీ హోం డెలివరీ సైతం ప్రారంభించింది. జిల్లా నుంచి వరంగల్, హైద్రాబాద్, కరీంనగర్ వంటి దూర ప్రాంతాలకు ఏ వస్తువులు పంపించినా ఇండ్ల వద్దకు డెలివరీ చేస్తున్నారు. హోం డెలివరీతో మరింత ఆదాయం వస్తుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

● జిల్లా పరిధిలోని కార్గో సెంటర్లు

మంచిర్యాల డిపో పరిధిలో కార్గో సేవలు విస్తృతమవుతున్నాయి. మంచిర్యాల, చెన్నూరు, రామకృష్ణాపూర్, మందమర్రి, మందమర్రి మార్కెట్, లక్సెట్టిపేట, జన్నారం, శ్రీరాంపూర్, దేవాపూర్, నెన్నెల, దహెగాం, తాండూర్, ఐబీ, దండేపల్లి, మాడవెల్లి సెంటర్లలో ఆర్టీసీ కార్గో సేవలందిస్తుంది.

పంపిన సరుకులు ఎక్కడున్నాయో తెలుసుకునేందుకు ట్రాకింగ్ వ్యవస్థ కూడా అందుబాటు లో ఉండడంతో ప్రజలు ఎప్పటికప్పుడు వస్తువులు ఏ లొకేషన్‌లో ఉన్నాయో తెలుసుకోగలుగుతున్నారు.



మంచిర్యాల ఆర్టీసీ డిపో వద్ద ఉన్న కార్గో కార్యాలయం



ఆర్టీసీ కార్గో సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు

కార్గో సేవలను వినియోగించుకుంటున్నాం



ఆర్టీసీ కార్గో ద్వారా కొన్నేండ్లుగా వివిధ వస్తువులను బుక్ చేసుకుంటున్నాను. వస్తువులు ఎలాంటి డ్యామేజీ లేకుండా సమయానికి అందిస్తున్నారు. ప్రైవేటు పార్శిల్ సేవల్లో విలువైన సామగ్రి తెప్పుకోవాలంటే కొంత అభద్రతా భావం ఉంటుంది. ఆర్టీసీ కార్గో ద్వారా దూర ప్రాంతాల నుంచి మెడిసిన్స్, ఇతర వస్తువులను బుక్ చేసుకున్నప్పుడు సరైన సమయానికి అందిస్తున్నారు. కార్గో సేవలు వ్యాపారస్తులందరికి ఉపయోగకరంగా ఉన్నాయి.

\- వేద కిరణ్, మెడికల్ షాపు నిర్వహకుడు, మంచిర్యాల

సద్వినియోగం చేసుకోవాలి



ప్రజల నుంచి ఆర్టీసీ కార్గో సేవలకు ఆదరణ లభిస్తుంది. ప్రజలకు మరింత చేరువ కావడానికి కార్గో డోర్ డెలివరీని ప్రారంభించాం. ఆర్టీసీ కార్గో సేవలపై వ్యాపారస్తులకు, ప్రజలకు అవగాహన పెంచేందుకు ర్యాలీలు చేపడుతూ అవగాహన కల్పిస్తున్నాం. కార్గో సేవల ద్వారా బుక్ చేసుకున్న కస్టమర్లకు మంచి సర్వీసు అందిస్తుండడంతో వ్యాపారస్తులు, ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. కార్గో సేవలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలి.

\- జనార్దన్, ఆర్టీసీ డిపో మేనేజర్, మంచిర్యాల

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చెన్నూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలకు గురువారం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి భూమి పూజ చేశారు. పుప్పాల హనుమాన్ వీధిలో రూ.2 కోట్లతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



టెస్ట్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ, తదితరులు

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని నస్పూర్ ఎంఈఓ దామోదర్ అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టెస్ట్‌కు హాజరయ్యారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు బత్తిని దేవన్నతో కలిసి ప్రశ్నపత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ, మొదటి స్థానం సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని అన్నారు. ట్రస్మా మండల అధ్యక్షుడు మైదం రామకృష్ణ, కార్యదర్శి ఊట్ల సత్యనారాయణ, కోశాధికారి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు అమన్ ప్రసాద్, కరస్పాండెంట్లు తిరుపతి, జస్టిన్, ప్రిన్సిపాల్ రజిని, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు కర్రె లచ్చన్నలు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్‌లు లేకపోవడం బాధాకరమన్నారు. చట్టసభల్లో 50 శాతం బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రధాని మోదీకి లేఖ రాశామన్నారు. రమేష్, రాజేశం, భీమ్‌సేన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఇన్‌చార్జి డీటీడీవో

జన్నారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను మంచిర్యాల ఇన్‌చార్జి డీటీడీవో అంబాజీ తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించేలా విద్యార్థులను ప్రణాళికబద్ధంగా చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయుడు శివరాజం, హెచ్‌డబ్ల్యూవో శాంతి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

జన్నారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తపాలపూర్ ప్రభుత్వ హాస్టల్‌లోని విద్యార్థులకు గురువారం వార్డెన్ గోపాల్ దుప్పట్లను అందజేశారు. విద్యార్థులు చలి తీవ్రతను తట్టుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కిటికీలు మూసివేయడంతోపాటు ఎప్పటికప్పుడు విద్యార్థులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

పాఠశాలలను పరిశీలించిన ఎంఈవో

చెన్నూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లక్కపేట, లంబడిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఈవో రాధాకృష్ణమూర్తి పరిశీలించారు. హాజరు శాతం, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతర విద్యార్థుల సామర్థ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.

ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

జన్నారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొన్న ధాన్యానికి రశీదులు చెల్లించాలని సూచించారు. ఏవో సంగీత, ఏపీఎం బుచ్చన్న పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సంకె రవిలు తెలిపారు. గురువారం మార్క్స్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికులను పట్టించుకోవడం లేదని, వారి సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఈ నెల 26న జిల్లా కేంద్రంలో చేపడుతున్న నిరసన కార్యక్రమానికి రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. నాయకులు మేకల దాసు, బ్రహ్మానందం, రంజిత్, మాణిక్యం, ఖలీందర్‌అలీఖాన్, రామన్న, సారయ్యచంద్రయ్య, తిరుపతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబును సన్మానించిన జనక్ ప్రసాద్

మందమర్రి టౌన్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల లో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబును కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ కలిశారు. హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

పేదలకు విద్య, వైద్యం ప్రభుత్వం బాధ్యత

5వ పేజీ తరువాయి

రూ.10లక్షలతో ఆరోగ్యశ్రీ, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నామని అన్నారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్స్‌రేట్లు పదేళ్లలో పెంచలే కపోయారని, తాము పెంచి చూపించామన్నారు. రైతులకు రూ.18వేల కోట్ల రుణమాఫీ చేశామని, సన్న బియ్యానికి రూ.500బోనస్ ఇస్తున్నామన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేశామని, సాంకేతిక ఇబ్బందుల కారణంగా ఎక్కడో ఇద్దరికో, ముగ్గురికో అందలేదని గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. మీరు రూ.లక్ష రుణమాఫీ విడుతల వారీగా చెల్లిస్తే, అవి వడ్డీలకు కూడా సరిపోలేదన్నారు. రాబోయే కాలంలో రైతులు, సింగరేణి కార్మికుల సంక్షేమం చేపడతామన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. సింగరేణిలో కొత్తగనుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఈనెల 19 నుంచి డిసెంబరు 7వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించాలన్నారు. మంచిర్యాలలో వరద ప్రభావిత ప్రాంతాలు ముంపునకు గురికాకుండా రూ.262 కోట్లతో కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. రూ. 40కోట్లతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అభివృద్ధి చేసి, నాణ్యతా ప్రమాణాలతో విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద అంతర్గత రహదారులను నిర్మిస్తూ మండల, జిల్లా కేంద్రాలకు అనుసంధానం చేస్తామని, జిల్లాలో పారిశ్రామిక వాడల అభివృద్ధి, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటుతోపాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తామని తెలిపారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటులో భాగంగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మొదటిసారిగా మంచిర్యాల నియోజ కవర్గం దండేపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉత్తర తెలంగాణలోనే చరిత్ర సృష్టిస్తుందన్నారు. ఆసుపత్రి ద్వారా దాదాపు 15 లక్షల మందికి మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. ఆసుపత్రి ఏర్పాటుకు రూ.324 కోట్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆ నిధులతో 225 పడకలతో మాతా శిశు, 425 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తామని తెలిపారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ బొర్కడే, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, తెలంగాణ మినిమం వేజెస్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్‌రాజ్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సులేమాన్, మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్లు రావుల ఉప్పలయ్య, సురిమిల్ల వేణు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



సభకు హాజరైన జనసందోహం

మంత్రుల పర్యటన ప్రశాంతం...

మంచిర్యాల అర్బన్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా సమీపంలో గురువారం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ, మాతా శిశు ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు హాజరయ్యారు. మంత్రుల పర్యటన ప్రశాంతంగా ముగిసింది. సీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. ఐదుగురు ఏసీపీలు, 15మంది సీఐలు, 50మంది ఎస్సైలు, 300 మంది సిబ్బంది బందోబస్త్‌లో పాల్గొన్నారు. బంద్‌బస్త్‌ను మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ పర్యవేక్షించారు.

ట్రాఫిక్ ఆంక్షలు...

మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో పోలీస్ అధికారులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గోదావరిఖని, చెన్నూర్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు, భారీ వాహనాలను శ్రీరాంపూర్ ప్రాంతంలోని జాతీయ రహదారి (ఎన్-363) వైపు మళ్లించారు. లక్సెట్టిపేట పట్టణం వైపు నుంచి వచ్చే వాహనాలను బైపాస్ రోడ్డుకు మళ్లించారు. ట్రాఫిక్ రద్దీగా ఉన్న నేపథ్యంలో భారీ వాహనాలను 2, మూడు గంటలపాటు వేంపల్లి ప్రాంతంలో నిలిపివేశారు. మంత్రుల పర్యటన అనంతరం ఐబీ చౌరస్తా నుంచి మొదలుకొని లక్ష్మి థియేటర్ చౌరస్తా వరకు కూడళ్లలో 10 నిమిషాల పాటు వాహనాలను నిలిపివేశారు.

అలంరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

మంచిర్యాల కలెక్టరేట్/గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిర్మించనున్న ప్రభుత్వ ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో సాం స్కృతిక సారధి కళాకారులు నిర్వహించిన ప్రదర్శనలు అలరించాయి. సభ అనుకున్న సమయానికి కంటే 2 గంటలు ఆలస్యం కావడంతో ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై కళాకారులు వివరిస్తూ గీతాలను ఆలపించారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, ఆరోగ్య శాఖ మంత్రి దామో దర రాజనర్సింహా, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు ఘనంగా స్వాగతం పలి కారు. సభకు 5 వేల మందికి పైగా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఇందుకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేశారు. మంచినీరు, పండ్లు, భోజనాలను ఏర్పాటు చేయడంపై సభకు వచ్చిన వారు హర్షం వ్యక్తం చేశారు.

సభకు తరలిన గ్రామైఖ్య సంఘుల మహిళలు

దండేపల్లి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ భూమిపూజ కార్యక్రమానికి దండేపల్లి మండలం నుంచి ఐకేపి గ్రామైఖ్య సంఘాల మహిళలు, సంఘ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు.

మంత్రులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే

- ఆలస్యంగా వచ్చిన హెలికాప్టర్
- సాంకేతిక లోపమే కారణం

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని ఐబీచౌరస్తాలో నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ, మాతా, శిశు ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం జిల్లాకు రాగా వారికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌లో ఘనస్వాగతం పలికారు. హెలికాప్టర్ ఉదయం 11.30 గంటలకు కలెక్టరేట్ హెలిప్యాడ్‌కు రావాల్సి ఉండగా సాంకేతిక సమస్యతో మధ్యాహ్నం 1.45 గంటలకు వచ్చింది. మంత్రులకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు బొకేలు అందించి స్వాగతం పలికారు. కలెక్టర్ కుమార్ దీపక్, సీపీ శ్రీనివాస్, మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్ బి.జనక్ ప్రసాద్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, మున్సిపల్ కమిషనర్ సతీష్, డీసీపీ, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

● కలెక్టరేట్ నుంచి ఐబీచౌరస్తా వరకు బైక్‌ర్యాలీ చేయాలని భావించినా, మంత్రుల రాక ఆలస్యం కావడంతో విరమించుకున్నారు. మంత్రుల కాన్వాయ్ నేరుగా సభాస్థలి వద్దకు వెళ్లింది.

సీతక్క రావాల్సినా...

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) కూడా కార్యక్రమానికి రావాల్సి ఉండగా, ఒక్కరోజు పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలి కేందుకు ఆమె అక్కడే ఉండిపోయారు.



మంత్రి దామోదరకు స్వాగతం పలుకుతున్న పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



సభలో పాటలు పాడుతున్న కళాకారులు

బహుముఖ ప్రజ్ఞాశాలి నాగరాజు

- కళాకారుడు, రచయిత, దర్శకుడు, నటుడిగా రాణింపు
- సినిమా రంగంలో తనదైన ముద్ర
- వేలాది ప్రదర్శనలు.. 6



జై బోలో తెలంగాణ చిత్ర షూటింగ్‌లో జగపతిబాబుతో కలిసి నాగరాజు

ఇంటి వద్దకే కార్గో సేవలు

- వస్తువులు త్వరగా చేరవేత
- ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు
- ఆర్టీసీ సేవలను ఉపయోగించుకుంటున్న ప్రజలు, వ్యాపారులు 7



ఆర్టీసీ కార్గో ద్వారా వచ్చిన వివిధ వస్తువులు

పేదలకు విద్య, వైద్యం ప్రభుత్వం బాధ్యత

- అత్యవసర సేవల కోసం అంబులెన్స్‌లు
- ప్రతీ 30 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్
- డయాలసిస్ కేంద్రం 30 పడకలకు అప్‌గ్రేడేషన్
- జిల్లాలో అదనంగా 29 ఉప కేంద్రాల ఏర్పాటు
- ఉత్తర తెలంగాణలో 4 క్యాన్సర్ కేంద్రాలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు, ప్రమాణాలతో కూడిన విద్య అందించడం ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంటుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతికశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం ఐబీ చౌరస్తా సమీపంలో రూ.324 కోట్ల అంచనా వ్యయంతో 650 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మాతా శిశు కేంద్రానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుతో కలిసి భూమిపూజ, శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి మాట్లాడుతూ మంచిర్యాల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వైద్య సేవలు మెరుగుపడతాయన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా 90శాతం సేవలు స్థానికంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైద్యశాఖలో 7 వేలకుపైగా సిబ్బందిని నియమించామని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు అందుబాటులో ఉండేలా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ మండలానికి ఒక్కటి చొప్పున గిరిజన ప్రాంతాల్లో రెండేసి అంబులెన్స్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి 30 నుంచి 35 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్ చొప్పున రాష్ట్రంలో 74 సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్తర తెలంగాణలో నాలుగు క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయనుండగా మంచిర్యాల జిల్లాకు ఒకటి కేటాయిస్తామన్నారు. వస్కులర్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం జిల్లా కేంద్రంలో ఉన్న డయాలసిస్ కేంద్రంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కోరిక మేరకు పడకల సంఖ్యను 10 నుంచి 30కి పెంచుతామని హామీ ఇచ్చారు. జన్నారం పీహెచ్‌సీని 6నుంచి 30పడకల సామర్థ్యానికి పెంచుతామన్నారు. మంచిర్యాల నియోజక వర్గంలోని వెంకట్రావుపేట, చెన్నూరు నియోజకవర్గంలోని అంగ్రాజ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునీకరించడంతోపాటు 24 గంటలు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో అబద్దాలు, మోసాలతోనే గడిచిందని, అందుకే ప్రజానీకం ప్రాంతీయ పార్టీకి చమరగీతం పాడారని బీఆర్‌ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. రేవంత్ సర్కారు ఏర్పడగానే ఆరోగ్యశ్రీలో రెట్టింపు డివిజన్ చేపట్టి పథకం పరిధిని రూ. 5 లక్షల నుంచి 10లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. ఇండ్ల స్థలాలు, ఇళ్లు, ఉద్యోగాలు ఇచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని ప్రతిపక్షం ఎందుకు విమర్శిస్తుందో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రూ.7 లక్షల కోట్లు అప్పుచేశారని, ప్రజాసంక్షేమం ఎక్కడా కానరాలేదని విమర్శించారు.

ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పది నెలల కాలంలో ప్రభుత్వం ఏం చేసిందని అంటున్నారని అనైతికంగా, అడ్డగోలు విమర్శలు కాకుండా ప్రతిపక్ష హోదా పాటించాలని హితవు పలికారు. మీరు పదేళ్ల కాలంలో చేయలేనివి మేము 6గ్యారెంటీలు అమలు చేస్తున్నామని బీఆర్‌ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, వంట గ్యాస్‌పై రూ.500 సబ్సిడీ, ...

మిగతా 7లో



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

న్యూస్ బాక్స్

టోల్‌ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చెన్నూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు టోల్‌ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏడీఈ బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌ను అందుబాటులో ఉందన్నారు. వినియోగదారులు ఏ సమస్య ఉన్నా టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. బిల్లులో పొరపాట్లు, విద్యుత్ మీటర్ల మార్పు, పేరు మార్పు, కేటగిరి మార్పు, లోడ్ మార్పు తదితర సమస్యలకు టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఉపయోగించుకోవాలన్నారు.

మామిడిగూడ తండాలో ప్రబలుతున్న జ్వరాలు



జ్వరంతో బాధపడుతున్న మహిళ

కాసిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మామిడిగూడ తండాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పదుల సంఖ్యలో జ్వర బాధితులు మంచం పట్టారు. పది రోజుల నుంచి మామిడిగూడెంలో జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతోంది. తండాలో పారిశుధ్యం లోపించడంతో జ్వరాలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. జ్వరాలు తగ్గినా ఒళ్ళు నొప్పులు తగ్గడం లేదని, ఆరోగ్య కేంద్రానికి వెళితే మాత్రలు ఇచ్చి పంపుతున్నారని, ఎలాంటి పరీక్షలు చేయడం లేదని వాపోతున్నారు. గ్రామం లో వైద్య శిబిరం నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతు

భీమారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్కేశ్వరం పంచాయతీలోని ఎల్‌బీపేట్ నుంచి సుద్దాల మధ్యలో రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో కాంగ్రెస్ నాయకుడు చేకుర్తి సత్యనారాయణ సొంత ఖర్చులతో గురువారం మరమ్మతు చేయించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలతో రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో మరమ్మతు చేయించానన్నారు. సమ్మయ్య, మహేందర్, రమేష్, సంపత్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం : ఎస్‌ఎఫ్‌ఐ

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఈదునూరి అభినవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలో సూపర్ స్పెషాలిటీ, మాతా, శిశు ఆస్పత్రికి శంకుస్థాపన చేసేందుకు గురువారం మంత్రులు శ్రీధర్‌బాబు, రాజనర్సింహ రాక సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. ఇది అప్రజాస్వామిక చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏడేళ్లుగా ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో 8500 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకు లాలకు సొంత భవనాలు లేవని పేర్కొన్నారు. అద్దె భవనాల్లో విద్యార్థులు అగచాట్లకు గురవుతు న్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు పోరాటం కొనసాగిస్తామని అభినవ్ వివరించారు.

జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక



ఉపేందర్

బెల్లంపల్లిరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ జూనియర్ కళాశాల లెక్చరర్ల ఫలితాలను గురువారం సాయంత్రం విడుదల చేసింది. ఇంగ్లీష్ సబ్జెక్టులో బెల్లంపల్లి మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన సింగతి ఉపేందర్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. ఆయన 2018లో గురుకుల ఉపాధ్యా యుల కోసం నిర్వహించిన పరీక్షల్లో టీజీటీ, పీజీటీగా ఉద్యోగాలు పొందగా పీజీటీ ఎంపిక చేసుకుని విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయనను మిత్రులు, బంధువులు అభినందించారు.

అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు

- రూ.7.25 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం
- స్లాబ్‌ల అనంతరం నిలిచిపోయిన పనులు
- మూడేళ్ళు కావస్తున్నా అతీగతీ లేదు



అసంపూర్తిగా మిగిలిన సమీకృత మార్కెట్ భవనం

నస్పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ మున్సిపాలిటీ సుందరయ్య కాలనీ వారసంతలో చేపట్టిన సమీకృత మార్కెట్ (ఇంటిగ్రేటెడ్ మార్కెట్) నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. టీయుఎఫ్ఐడీసీ నిధులు రూ.7.25 కోట్ల వ్యయంతో 2022 ఫిబ్రవరి 19న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శంకుస్థాపన చేశారు. గ్రౌండ్, మొదటి అంతస్తు స్లాబ్‌ల నిర్మాణం అనంతరం పనులు నిలిచిపోయాయి. ఆధునిక సదుపాయాలతో మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టేందుకు మార్చిలో కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఆరు మాసాల కాలపరిమితితో పనులు పూర్తి చేయాల్సి ఉండగా మూడేళ్ళు కావస్తున్నా నిర్మాణ పనులు పూర్తికాలేదు. సరుకులు తరలించడానికి, వినియోగ దారులు స్టాల్స్‌కు వచ్చి వెళ్ళడానికి ఇరువైపుల రెండు లిఫ్టులను ఏర్పాటు చేయాల్సి ఉంది. మార్కెట్ చేరువలోకి వస్తుందని ఆశించిన పట్టణ ప్రజానీకానికి నిరాశే ఎదురవుతోంది.

● ఎప్పటికి పూర్తయ్యేనో...

సుందరయ్య కాలనీ సమీపంలో దాదాపు రెండు దశాబ్దాలుగా వారసంత నిర్వహిస్తున్నారు. చుట్టుపక్క ప్రాంతాల ప్రజలకు కూరగాయలు, పండ్లు, దుస్తులు, మసాలాలు తదితర వ్యాపారం జరుగుతోంది. వారసంత స్థానంలో మార్కెట్ నిర్మించాలని ప్రతిపాదించారు. కూరగా యలు, మాంసం, చికెన్, పండ్లు, పూలు తదితర వాటిని ఒకే సముదాయంలో లభించే విధంగా మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో పనులు ప్రారంభించారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున పనుల్లో జాప్యం జరుగుతుందని తెలుస్తోంది. భవనాల పనులు అసంపూర్తిగా ఉండడంతో శనివారం, మంగళవారం సంత నిర్వహణ ప్రైవేట్‌స్థలం, రోడ్డుపై జరుగుతోంది. అక్కడ సరైన వసతులు లేక వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ప్రైవేట్ స్థలంలో కొనసాగుతున్న సంత

● చిరు వ్యాపారులకు ఉపాధి...

మున్సిపాలిటీకి వారసంత ద్వారా ఏడాదికి రూ.3.18 లక్షల ఆదాయం వస్తోంది. వార సంతపై ఆధారపడి దాదాపు 350మంది చిరువ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. సమీకృత మార్కెట్ నిర్మాణంతో హోల్‌సెల్ వ్యాపార కేంద్రాలు వెలిసి పలువురికి ఉపాధి లభించే అవకాశం ఉంది. మార్కెట్ నిర్మాణం త్వరగా పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

● పనులు చేస్తాం..

-మధుకర్, డీఈ-మున్సిపల్ పబ్లిక్ హెల్త్

నస్పూర్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు తొందరగానే చేపట్టి పూర్తి చేస్తాం. వివిధ రకాల వలన పనుల్లో ఆలస్యమైంది. సాధ్యమైనంత వరకు పనులు మొదలు పెట్టి పూర్తి చేసే ప్రయత్నాలు చేస్తాం.

బొగ్గు బ్లాకుల వేలం పాటను రద్దు చేయాలి



సోమగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, ఆటో యూనియన్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం పాటను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్ డిమాండ్ చేశారు. వేలం పాటలను రద్దు చేయాలని గురువారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సింగరేణి సంస్థను నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. పని చేస్తున్న కార్మికులను బలవంతంగా ఇండ్లకు పంపించే కుట్రలో భాగంగా బొగ్గు బ్లాకులకు వేలం పాటలు నిర్వహిస్తోందన్నారు. వేలం పాటలను రద్దు చేసి బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, మోహన్ పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): బొగ్గు బ్లాకుల వేలం పాటలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు సోమగూడెం చౌరస్తా వద్ద ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ఆటో యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ బొగ్గు బ్లాకుల వేలం పాటలను నిరసిస్తూ ఈ నెల 18 నుంచి సంతకాల సేకరణ చేపడుతున్నామని తెలిపారు. సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. దూలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోడల్ లైబ్రరీ ప్రారంభం



ఇందారం పాఠశాలలో లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

జైపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇందారం ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని గురువారం ఎంఈవో బోనగిరి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు లైబ్రరీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. లైబ్రరీలో పలు రకాల కథల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. హెచ్ఎంలు రాజగోపాల్, శ్యామ్, వెంకటస్వామి రూమ్‌టూ రీడ్ జిల్లా పర్యవేక్షకుడు మధు, మండల పర్యవేక్షకురాలు గీత , విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్ మండల పరిషత్ పాఠశాల ఆవరణలో రూమ్ టూ రీడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లైబ్రరీని ఎంఈవో వెంకటేశ్వర స్వామి ప్రారంభించారు. బొమ్మల ఆధారంగా పఠన స్థాయి పెంచుకోవడానికి లైబ్రరీ ఉపయోగపడుతుందన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు సాంబమూర్తి, రమేష్‌రాథోడ్, సుధాకర్‌నాయక్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమాదేవి, రాజేశ్వరి, రూమ్ టూ రీడ్ కో ఆర్డినేటర్ రాము , తిరుపతి, సీఆర్‌పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం బలోపేతానికి కృషి చేయాలి



దండేపల్లిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

దండేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ సంఘం బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గరిగంటి కొమురయ్య, యువజన అధ్యక్షుడు గరిగె సుమన్ సూచించారు. దండేపల్లిలో గురువారం మత్స్యకారుల దినోత్సవ, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. అధ్యక్షుడు మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఎలోకి మారుస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ముదిరాజ్‌ల ఐక్యతను చాటి చెప్పేందుకు కమిటీలను వేయాలన్నారు. తాండబోయిన శ్రీకాంత్, కంకణాల సతీష్, మేకల తిరుపతి, మండల నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాధనబోయిన కృష్ణ మాట్లాడుతూ మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు రమేష్, నాగరాజు, మధుకర్, మొండి, శ్రీనివాస్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ముదిరాజ్ మత్స్యకారుల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పెండ్యాల మధు జెండాను ఎగురవేశారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టి సంబరాలు చేసుకున్నారు. రాకేష్, రాజన్న, మల్లేష్, సారయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.